

# చావు

కె. వివేకానందమూర్తి

శ్రీనివాసులుకి [illegible]పోదా మనిపించింది. ఇదివరకు ఇలా చాలాసార్లు అనిపించింది. కష్టమొచ్చి నప్పుడల్లా శ్రీనివాసులు చచ్చి పోదామనుకుంటాడు. అతనికి కష్టాలు చాలాసార్లు వచ్చాయి. అందుకని చాలాసార్లు చచ్చిపోదా మనుకున్నాడు.

శ్రీనివాసులు మానసికంగా చచ్చిపోయి నప్పుడు. శారీరకంగా చచ్చిపోదామను కుంటాడు. కష్టాలొచ్చి నప్పుడల్లా శ్రీని వాసులు మానసికంగా చచ్చిపోతాడు. చావు మీది కోరికని అతనికి మనస్సు నేర్పింది. శ్రీనివాసుల్ని మనస్సుని అస్తమానం కష్టం భయపెడుతూ వుంటుంది. కష్టంపెట్టే కష్టాలు భరించలేక అతని మనస్సు పరిష్కారం వెదుక్కున్నప్పుడు శ్రీనివాసులికి 'చావు' సమాధానంగా నిలుస్తుంది.

శ్రీనివాసులికి ఇప్పుడు బ్రతుకు చావులా వుంది, అతనికి చచ్చిపోవాలని లేదు. బ్రత కాలని వుంది. బ్రతుకుతుంటే చచ్చిపోయి నట్టు వుంది కనుక చచ్చిపోతే బ్రతకవచ్చు ననిపించింది శ్రీనివాసులికి.


శ్రీనివాసులుకి చిన్నప్పట్నుంచీ డాల్ఫిన్స్ నోస్ కొండ మీదినుంచి ఒకసారి సరదాగా దూకాలని. సినిమా రిజర్వుడు క్లాసుకి ఒక సారి వెళ్ళాలని, ముష్టివాడి వేషం వెయ్యా లని, 'షాంపేన్' తాగాలని, రాజకీయ నాయ కుడు అవ్వాలని కోరికలుండేవి. పెళ్ళవక మునుపు రెండోదీ, మూడోదీ తీర్చేసు కున్నాడు. భయంవేసి నాలుగోదని చెయ్య లేదు. ఆఖరిదానికి అందుబాటులో లేదు కనుక ఆశ అనుకున్నాడు - తీరేవన్నీ కోరి కలు, తీరనివన్నీ ఆశలు - అనుకుంటాడు శ్రీనివాసులు ఎప్పుడూ.

మొదటిది మాత్రం ఆలోచించవలసిన విషయం అనుకుని జ్ఞాపకంగా అట్టేపెట్టు కున్నాడు.

శ్రీనివాసులు చాలాసార్లు శవాల్ని, శవా లుగా మనుష్యుల్ని తయారుచేసే డాక్టర్లనీ, శవాలుమోసే వాళ్ళని చూశాడు. అలా చూడగా చూడగా అతనికో ఆలోచన పుట్టింది. శవాలు రాజకీయ నాయకులైనట్టు, అవి సప్తకట్ల సవారీ అనబడే పల్లకీలో పడు కున్నట్టు, వాటిని మోసేవాళ్ళు రికమెండే షన్లు స్వంతం చేసుకున్న చుట్టాలు, దగ్గిర మిత్రులు అయినట్టు - వాటిని తయారుచేసే డాక్టర్లంతా కాబోయే రాజకీయ నాయకులై నట్టూ తోచింది అతనికి. అందుకని చచ్చి పోతే చివరి ఆశ నెరవేరుతుంది అనిపిం చింది. మొదటికోరిక తీర్చుకుంటే చివరి ఆశ, కోరికగా మారిపోతుందని కూడా తోచింది. చివరి ఆశ ఫలిస్తే ఇక నాలుగో దానికి లోటులేదు. అలా అతని జీవితం కోరి కలనేవి మిగలకుండా హాయిగా అంతమవు తుందని కూడా అనుకున్నాడు.

నిశ్చయంగా శ్రీనివాసులు చచ్చిపోవా లనుకున్నాడు. లేక నిశ్చయంగా శ్రీని వాసులు బ్రతుకు ప్రారంభించా లను కున్నాడు.

పదేళ్ళ క్రితంనుంచీ అతని జీవితంలో 'చావు' అన్న పదానికి 'ప్రత్యేకత' ఎక్కు వైంది. దానికి కారణం-పదేళ్ళ క్రితం శ్రీని వాసులికి పెళ్ళయింది. ఇలా పదేళ్ళుగా అతన్ని కష్టాలు, మనస్సు, చావు మీది కోరికా క్షోభపెడుతున్నాయి. వీటిల్లో ఏ వొక్కటి చంపుకోవాలన్నా తను చచ్చి పోవాలి. ఈ పదేళ్ళ జీవితం శ్రీనివాసులికి చెప్పిన నిర్వచనం యిది : పెళ్ళితో ఆడ దాని జీవితము, మగవాడి కష్టములు ప్రారంభ మగును అని. అతని కష్టాలు ఎప్పుడూ అతని సహనాన్ని కొలుస్తాయి. సహనం అనే




వాళ్ళకంటె ఎక్కువగా మగవాళ్ళకే క్షేమంవని నిరూపించగలడు శ్రీనివాసులు.

శ్రీనివాసులి భార్య పేరు జానకి. సన్నంగా, అల్పంగా, ఎండుటాకులా వుంటుంది. కుంపటి అంటించడంలో సర్వస్వం తగులబడి ఖర్చయిపోయిన కాగితపు అవశిష్టంలా ఉంటుంది- పదేళ్ళ సంసారం వెలిగించడంలో, పిల్లల్ని కనడంలో ఖర్చయిపోయిన జానకి. ఎవరో పేరు తెలియని వ్యక్తి, ఓ పన్నటి కర్రస్టాండు మీద చీరా, రవికా పారేసుకుపోయినట్టు ఉంటుంది. శ్రీనివాసులి భార్య జానకి, పదేళ్ళ సంసారంలో ఆమె ఎనిమిదేళ్ళ తొమ్మిదిమంది పిల్లల్ని కనడానికి, మిగిలిన రెండేళ్ళు రోగాల్ని భరించడానికి వాడుకుంది. ఎప్పుడేనా రోచనప్పుడు దేవుడు, శ్రీనివాసులి కష్టాల్లో ఓ కష్టాన్ని పిలిచి "కష్టమా ! కష్టమా ! ఆ తొమ్మిదిమంది పిల్లల్ని శ్రీనివాసులి పెళ్ళాం ఆ జానకే కన్నదా ?" అని అడిగితే — కష్టం 'దేవుడితో' "నీకేం మతిలేదా ? సన్నంగా, అల్పంగా, ఎండుటాకులా దాక్షిణ్య వాయకుడి మంచితనంలా ఉన్న జానకి తొమ్మిదిమంది పిల్లల్ని కంటుందని ఎలా ఊహించావ్ ? ఆ పిల్లల్ని శ్రీనివాసులే కన్నాడు" అంటుంది. ఇవేం పట్టని శ్రీనివాసులు వాళ్ళ అవిణ్ణి చూసుకొన్నప్పుడల్లా ప్రత్యేకం దూరప్రయాణాల కోసం గవర్నమెంటు వారు డీలక్స్ బస్సుని కేటాయించినట్లు, ప్రత్యేకం పిల్లల్ని కనడంకోసం వాళ్ళావిణ్ని దేవుడు ఈ భూమ్మీద పుట్టించాడని అనుకుంటాడు. వాళ్ళ పెరట్లో నందివర్ధనం మొక్క పువ్వుల్ని పూసినట్లు, ఎడమధ్యాహ్నవేళ నడినెత్తిని సూర్యుడు నిలబడి ఎండకాసినట్లు తన భార్య రోగాలమధ్య నిలబడి పిల్లల్ని కంటోంది అని కూడా అనుకుంటాడు.

శ్రీనివాసులు గుమాస్తా. శ్రీనివాసులు గుమాస్తా అవడంకంటే, శ్రీనివాసులి పేరు గుమాస్తా అంటే బాగుండేది. గుమాస్తా పేరు శ్రీనివాసులు అంటే ఇంకా బాగుంటుంది. ఇట్లు గుమాస్తా అయిన శ్రీనివాసులికి రక్తం మాంసం లేవు. వాటిని అతని టేబులుమీద రోజూ ప్రత్యక్ష్యమయ్యే కాగితాలు, అతని హెడ్ గుమాస్తా కలిసిస్వాహా చేశాయి. ఇప్పుడు శ్రీనివాసులుకి మిగిలినవి ఒక ఎముకల పోగు, ఒక గుండె.

శ్రీనివాసులికి పెళ్ళాం, పిల్లలూ తప్ప మరెవ్వరూ లేరు. రెండు నెలల క్రితం వరకూ అతనికి ఒక ముసిలి అమ్మమ్మగారు, ఒక పడుచు మరదలు ఉండేవారు. రెణ్ణెళ్ళక్రితం ముసిలి అమ్మమ్మగారు రోగం బాధ పడలేక ప్రాణాలు తీసుకుని చచ్చిపోయింది- పడుచు మరదలు పడుచు తనం బాధపడలేక ప్రాణాలు తీసుకుంటానని యింట్లో చెప్పి ప్రకాశాన్ని తీసుకుని లేచిపోయింది. పదేళ్ళక్రితం ఆలోచన తన భార్యకు కలగలేదని శ్రీనివాసులు వాపోయాడు. ఇక ఇప్పుడు శ్రీనివాసులు, రోగిష్టి పెళ్ళాం, తొమ్మిది మంది పిల్లలూ తప్ప ఎవ్వరూ లేరు ఆ కొంపలో.

* * *

తెల్లవారింది. క్రితం రాత్రి శ్రీనివాసులి భార్య సన్నంగా, అల్పంగా, ఎండుటాకులా వున్న జానకి పడే ప్రసవ వేదన చూసి ఆకాశం గుండె పగిలేలా ఏడిచింది.

రాత్రంతా కుంభవృష్టి కురిసింది.

ఈరోజు — నిన్న పన్నెండు దాటిం తర్వాత-పదోసారిగా నొప్పులుపడి చచ్చిన పిల్లవాణ్ణి కని, చచ్చిపోయింది జానకి. శ్రీనివాసులి భార్య. భార్య బ్రతికున్నప్పుడల్లా అతనికి నిండుతనం తెలిసేది కాదు. ఇప్పుడు భార్య పోయింతర్వాత అతనికి నిండుతనం అర్థం తెలుస్తోంది. మనస్సు వెలితిని గుర్తు చేస్తోంది.

పదహారేళ్ళ సిగ్గుపడే జానకి అతని కళ్ళ ముందు మెదిలింది. కార్యంనాడు ఊపిరి సలపనివ్వకుండా కళ్ళల్లో కళ్ళు, మొహంలో మొహం పెట్టి కౌగలించుకొన్నప్పుడు—సంతోషం, తృప్తి, కృతజ్ఞతా, అనురాగం, మేళవించిన నవ్వు గుండెల్లోకి విసిరిన జానకి నొప్పుల్తో బాధపడుతూ తనకేసి పొడి పెదవులతో జాలిగా చూసిన జానకి, తనకి టైఫాయిడ్ వచ్చినప్పుడు నిద్రకి దూరమయిపోయిన జానకి, ఎప్పుడూ —ఏమీ, కనీసం మల్లె పువ్వులైనా కొనిపెట్టమని అడగని జానకి, నిన్నరాత్రి కన్నీరు, కష్టాలు తనకు మిగిల్చి పోతున్నానని బాధపడిన జానకి, తెల్లవారకట్ల చచ్చిన పిల్లవాణ్ని చూసినప్పుడు మాతృహృదయం పగిలిపోగా ఏడవడానిక్కూడా ఓపిక లేక ఎండిన కళ్ళతో జాలి చూపు చూసిన జానకి, సుఖం అంటే తెలియని జానకి, సన్నంగా, అల్పంగా, ఎండుటాకులావున్న జానకి. పదేళ్ళు తనతో కలిసి బ్రతికిన జానకి, తన




జానకి ఇక లేదు. తన భార్య, తన సర్వస్వం తనకు తృప్తినిచ్చిన కష్టం ఇకలేదు. నిన్నటి అనుభవం ఈరోజు చావు లేని ఓ బలమైన పెద్ద జ్ఞాపకమైపోయింది. కంటి ముందు కనిపించేది మనస్సులో మిగిలిపోయింది. జానకి చావులో ఇంత బలం వుందా? అనిపించింది శ్రీనివాసులికి.

శ్రీనివాసులు తెల్లవారేవరకూ, వర్షం వెలిసేవరకూ భోరున ఏడిచాడు. తెల్లవారింది. వర్షం వెలిసింది. శ్రీనివాసులు ఏడుపు మానేశాడు. ఒకసారి వీధి అరుగు మీదికొచ్చి చుట్టూ చూశాడు. అప్పుడే తలంటుపోసుకుని, జుట్టు విరబోసుకుని వొళ్లు విరుచుకున్న స్త్రీలా వుంది ఊరు. పెళ్ళయిన కొత్తలో ఒక్కసారి మాత్రం పెళ్ళావిడ అలా కనిపించింది. మనిషిగా శ్రీనివాసులు సంతోషపడిన రోజు అదొక్కటే.



శ్రీనివాసులి గుండె పగిలింది.

లోపలికివెళ్ళి పెళ్ళాం శవంమీద పడి మళ్ళా భోరు భోరున ఏడిచాడు. సాయంకాలమైంది. అంతా అయిపోయింది.

పిల్లలు ఏడుస్తున్నారు హృదయవిదారకంగా.

శ్రీనివాసులు చచ్చిపోదామనుకున్నాడు. నిజంగా చచ్చిపోదామనుకున్నాడు. నిన్న రోగిష్టి పెళ్ళాం బాధచూసి చచ్చిపోదామనుకున్నాడు. ఇప్పుడు బ్రతకలేక చచ్చిపోదామనుకుంటున్నాడు. తనొక్కడూ తొమ్మిది మంది పిల్లల్తో. నెలకు డెబ్భై అయిదు రూపాయల జీతంతో సంసారాన్ని ఎలా నెట్టుకురావడం? తను బ్రతకలేక చావాలి. అందుకని చచ్చిపోయి బ్రతుకుదామనుకుంటున్నాడు.

చచ్చిపోయేముందు ఎప్పుడూ కాఫీ త్రాగి చచ్చిపోవాలనుకుంటాడు శ్రీనివాసులు. అలాంటి చావుకాఫీలు శ్రీనివాసులి గొంతులో పదేళ్ళుగా పాతబడిపోయాయి.

కొచ్చిన్ కేఫ్‌లో స్ట్రాంగ్ కాఫీత్రాగి సముద్రం వొడ్డున నడుస్తున్నాడు.

సముద్రం వొడ్డు వంపరలు ఎప్పుడూ అతనికి భార్య శరీరాన్ని గుర్తుచేస్తాయి. అందుకే అతనికి బీచ్ అంటే ఎంతో ఇష్టం. కెరటాలు వొడ్డుమీద పడుతున్నాయి. రోగాలు భార్య మీదపడి వేధించినట్టు మనస్సులో బాధ కదిలి కళ్ళల్లో నిర్వేదం నిండింది. తలెత్తి చూస్తే నల్లటి డాల్ఫిన్స్‌నోస భయానికి ప్రతిరూపంలా, పరాయి లోకానికి హాన్ బోర్డులా కనిపించింది.

డింగీ ఎక్కి, పాయదాటి కొండదిగువ భాగం చేరుకున్నాడు.

గతం మనస్సుని మింగి, కాలాన్ని తినివేసింది. పొద్దు వాలింది. శ్రీనివాసులు శిఖరానికి వచ్చేసరికి లైట్‌హౌస్ తళుక్కున మెరిసింది. ఒక్కక్షణం మనస్సులో పిల్లలు మెదిలారు. జేబులో రూపాయి కాసు. కొంత చిల్లర వుంది. అయ్యో! పిల్లలకేనా యిచ్చాను కాదు అనుకున్నాడు. కొండ అంచుకు వచ్చేశాడు. కళ్ళు మూసుకుని, చిన్నప్పుడు హైస్కూల్లో హైజంపు దూకినట్టు గెంతితే, రెండు నిముషాలు శరీరం పిచ్చిగా పరిభ్రమించి, మరోక్షణంలో కాఫీని, బీచ్‌ని, పిల్లల్ని వదిలిపెట్టేస్తుంది. మరచిపోతుంది. తన మొదటి కోరికకి అవకాశం యిన్నాళ్ళకి. శ్రీనివాసులు నిజంగా చచ్చిపోదామనుకొన్నాడు. మరోక్షణంలో చచ్చిపోతా ననుకున్నాడు.

సన్నటి గాలి రివట రివ్వున వీచి. పదేళ్ళ తర్వాత జీవితంలో ఆఖరిసారిగా సుఖాన్ని గుర్తుచేసింది.


ఒక్కక్షణం ఎందుకో తెలియని భయం వేసింది.

శ్రీనివాసులు కళ్ళుమూసుకున్నాడు.

ఉన్నట్టుండి ఓ చల్లటి చెయ్యి మెడ పట్టుకుని వెనక్కిలాగింది.

తను వెనక్కి తూలి నిభాయించుకున్నాడు. ఎదురుగా నెరిసిన తల, మాసిన తెలుపుగడ్డం, నోట్లో చుట్ట, మడిచి కట్టిన పాతపంచెతో ఓ ముసలివాడు నవ్వుతూ కనిపించాడు.

శ్రీనివాసులు స్తంభించి పోయాడు.




పిడుగుల వర్షం రాబోయి ఆగిపోయినట్టు, ఏదో పేరుతెలియని ప్రపంచ ప్రయత్నం విఫలమయినట్టు, సముద్రం పొంగి దేశాన్ని ముంచేసినట్టు, లేక దేశం చైనా వాళ్ళ హస్తగతమైపోయినట్టు, దేవుడు మరణించినట్టు అయింది శ్రీనివాసులికి ఎవరో తన స్వేచ్ఛన్ని ఉరితీశారు.

ముసలివాడు అద్దంలో మొహం చూసుకున్నట్టు చూస్తున్నాడు తనవైపు మునుప్పు లోతుల్ని కాయిస్తున్నట్టున్నాయి అతని కళ్ళు.

"ఇలా చెయ్యొచ్చునా బాబూ ?"

కూతురి భర్త కోరికతో తన్ను కౌగిలించుకున్నప్పటి అత్తగారి ప్రశ్నలా వుంది. శ్రీనివాసులుకి ముసలివాడి ప్రశ్న. ఆ అనుభవం తనకి తెలుసు. సిగ్గుతో చచ్చిపోయాడు తను — వెధవ 'చావు' మాటల్లోతప్ప పనికి రాదు ఏమీ చెయ్యలేక నిస్సహాయుడై "నన్నేంచేశావు ఆపావ్ ?" అన్నాడు.

ముసలివాడు నవ్వాడు.

"పిచ్చిబాబూ !" అని మళ్ళా నవ్వాడు.

శ్రీనివాసులు క్షణంసేపు చిన్నవాడై పోయాడు.

"నాకంటె తర్వాత పుట్టావ్. నాకంటె ముందు ఎలా సచ్చిపోతావ్ ?"

"అ రాగని ఎక్కడా రూలు లేదు. కావాలంటే ముందు నిన్ను తోసేసి, తర్వాత నేను దూకేస్తాను నీ తర్వాత నేను, నా ముందు నువ్వు చచ్చిపోవచ్చు"

"నేను పోలీసుని" అన్నాడు ముసలాడు.

"వీల్లేస్తున్నావా ? నిన్ను తోసేసి దూకటం మానేస్తాను"



"మనసు బాగా లేకపోతే ఎందుకు బాబూ ఊరికే కంగారుపడతావ్ ? ఊళ్లోకి రా. కుసింత కాఫీ తాగితే మనసు కుదుట పడుద్ది"

కాఫీపేరు చెప్పేసరికి శ్రీనివాసులుకి బ్రతుకుమీద ఆశ పుట్టింది. కాని వెంటనే పిల్లలు, సంసారం, జీవితం జ్ఞాపకానికి వచ్చాయి.

"నాకు కాఫీవద్దు. చావుకావాలి"

"రమ్ము కావాలా ?"

వెంటనే శ్రీనివాసులుకి షాంపేన్ మనసులో మెదిలింది. అతనికి ఆ పేరొక్కటే బాగా తెలుసు. తన పాత స్నేహితుడొకడు షాంపేన్ గురించి లెక్చర్లిచ్చేవాడు. షాంపేన్ త్రాగని జీవితం శ్రీనివాసులి చావులో అసమగ్రతని గుర్తుచేసింది.

"రమ్ముకాదు. నాకు షాంపేన్ కావాలి"

ముసలివాడు పొట్ట చెక్కలయ్యేలా నవ్వి "అలాగే. నడు" అన్నాడు.

"నిజంగా షాంపేన్ తాగిస్తావా ?"

"ఆఁ"

"అది తాగిం తర్వాత చచ్చిపోనిస్తావా?"

"సావనివ్వను. అయినా చాంపేను మొదటిసారి తాగనేక సత్తావ్ ?"

శ్రీనివాసులుకి వొళ్ళుమండింది.

"చచ్చినాడా ?" అని తిట్టాడు.

"బ్రతికేవున్నాను"

తను కోపంగా చూశాడు. ముసిలాడు గడ్డం ఊడిపోయేలా నవ్వాడు. వాడు నవ్వుతుంటే శ్రీనివాసులికి కోపంరెచ్చిపోతోంది. వాడి నోట్లో విడివిడిగా వున్న రెండు పళ్ళు ఎందుకో తన పనోడో క్షుద్ర వెధవనీ, ఆరో పిల్లముండనీ గుర్తుచేస్తున్నాయి.

"నోయిముయ్యి !"

"మరి వత్తావా ?"

"రాను"

ముసిలాడు మళ్ళా నవ్వాడు, వొళ్ళంతా కుదుపుకుంటూ. తనకి మళ్ళీ కోపం వచ్చింది. భయం వేసింది ఆ పళ్ళని చూసేసరికి. దొంగ వెధవ ! తన రహస్యం వాడికి తెలిసిపోయింది. అందుకే నవ్వి సాధిస్తున్నాడు. వీడెవడో తిమ్మరుసులా వున్నాడు రూపులోనూ, చేతల్లోనూ కూడా. కత్తులతోటీ, తుపాకులతోటీ గాక వీడు నవ్వుతో భయపెడుతున్నాడు. ఈ మాత్రందానికి వెధవకొండ ఎక్కలేక చచ్చాను. ఎక్కి బ్రతికాను. ఇప్పుడీ వెధవ చంపేస్తున్నాడు. అనుకుని ముసిలివాడ్ని అనుసరించాడు శ్రీనివాసులు.

బాగా చీకటిపడింది.

నడుస్తూంటే కాళ్ళక్రింద ఎండుపుల్లలు విరుగుతున్నాయి.

"ఎవర్నేనా లవ్ చేసావేటి ?"

"ఏం ?"

"అది సచ్చిపోనా దేటి ?"

"అసలేమిటి నీ ఉద్దేశం ?"

"ఉద్దేశాని కేటుంటది. ఓ రొత్తి నేనా లవ్వూ. ఆపైన గరభం నేసొగ్గేసి నావేమో అది టుపుక్కుమని సచ్చేసరికి నువ్వుకూడా సద్దామనుకున్నావేమో అని."

"అఘోరించినట్టే వుంది."

"మరేటికత—చుట్టకావాలా ?"

"వద్దు"



(8)

"మరి సెప్పు."

శ్రీనివాసులి మొహంలో బలహీనత స్పష్టమవుతోంది. ఈ ముసిలివాడు ఎవరు ? తనంటే వీడికెందుకింత తాపత్రయం ? అనుకున్నాడు.

"నీకెందుకు చెప్పాలి. నువ్వు నాకేమవుతావ్ ?"

"ఏటవుతాను ? బతికించినోణ్ణి. రచ్చ కుణ్ని. సెప్పవయ్యా ఎర్రిబాబూ."

"చెప్పేందుకేముంది. నిన్నటివరకూ వున్న పెళ్లాం తెల్లారేసరికి చచ్చిపోయింది. దెబ్భైఐదు జీతం. విశాఖపట్నం ఎల్లా బ్రతకడం ?"

ముసిలాడు మళ్ళా నవ్వాడు. వాడినవ్వుకి ఆ చుట్టుపట్ల పొదల్లోనూ, చెట్లమీదా పాకుతున్న పాములన్నీ పరిగెట్టుకు వచ్చి కిరి చేస్తాయేమోనని భయపడ్డాడు—ఈ వెధవకి నవ్వుతప్ప మరో యావ లేదేవిటి ? తనకి ఉక్రోషం వచ్చింది.

"నువ్వు కనవా పిల్లల్ని ?"

"ఓ సది కాదో వెర్రోడా? సచ్చిపోనాకి యింత సిన్ని కారణమా అని. ఎల్లల్ని పెంచ లేనోడివి ఎందుక్కన్నావ్ మరి ?"

శ్రీనివాసులు వెర్రిమొహం వేసుకుని చూశాడు.

"ఇదుగో అబ్బాయ్—ఓ మాట యిను. మనం బతకలేనప్పుడు సచ్చిపోవాలి. బగమంతుడు మనల్ని సచ్చిపోమని పుట్టించనేదు. బతకడం నేరుచుకోమని పుట్టించాడు. తెలిసిందా ? సావంటే నీకేటి తెల్సు ? సచ్చేసావు—సరేలే నడు." అన్నాడు గంభీరంగా ముసిలాడు.

ముసిలివాడి మాటల్లో శ్రీనివాసులికి వేదాంతం కనిపించింది. ఆశ్చర్యపడ్డాడు. ముసిలి... మీద ఆప్యాయత, బ్రతుకుమీది ఆశలతో అతడి హృదయం సంత్రస్తమయింది.

కొండదిగి అవతలివైపుకు దాటి మసీదు వీధి కొచ్చేశారు. చలివేస్తోంది. మెదడు వేడెక్కి పోతోంది.

పెద్ద పోస్టాఫీసు దగ్గర పదోనెంబరు చివరిబస్సు హారన్ మోగింది.

హార్బరు రోడ్డులో ముసిలి కుక్క మూలుగు వినిపిస్తోంది.

సోల్జర్ పేట సందులోకి తీసుకు పోతున్నాడు ముసిలివాడు.

ఒక సన్నటి గొందిలోకి నడిచి నాలుగో ఇంటిముందు ఆగి తలుపు తట్టాడు ముసిలివాడు. పెంకుటిల్లు. బాగా శిథిలావస్థలో వుంది. ఇంటి ముందునుండి ఓ పెద్ద మురికి కాలువ పారుతోంది. ఒకనాపరాయి పలక ఇంటి గుమ్మంలో వంతెనగా వేయబడింది.

తలుపు తెరుచుకుంది. ముసిలివాడి వెనకే శ్రీనివాసులు లోపలికి నడిచాడు. పదిహేను కాండిల్స్ దీపం వెలుగులో పచ్చటి చీర కట్టుకున్న పద్దెనిమిదేళ్ళ స్త్రీ కనిపించింది. శ్రీనివాసులు ఒక్కక్షణం కన్నార్పలేదు. తను లీలామహల్లో ఇదివరకు చూసిన ఓ పాత ఇంగ్లీషు చిత్రం మనస్సులో మెదిలింది. 'క్లియోపాట్రా' అని గొణుక్కున్నాడు పెదాల వెనుక. ముసిలివాడు పక్కగదిలోకి దారితీస్తూ,

"ఇల్లారా సిన్నోడా !" అని పిలిచాడు.

శ్రీనివాసులు వెళ్ళాడు. ఈ గది ముందు గదికంటె చిన్నదిగా వుంది. ఓపక్క నవారు మంచం, కొంచెం ఇటుగా రెండు పాతకుర్చీలు, ఒక చిన్న స్టూలు వున్నాయి. మూలగా అల్మైరా వుంది.

కూర్చోమని కుర్చీ చూపించాడు. ఇద్దరూ కూచున్నారు. ముసిలివాడు చుట్ట వెలిగించాడు. "అమ్మాయ్, మూల గూట్లో మందు సీసా పటాక్రి." అన్నాడు.

"ముందు మందు కొట్టేద్దాం ?"

"ఏం మందు ?"

బింగున నవ్వాడు. మళ్ళా మూడో వెధవా. ఆరోపిల్లా జ్ఞాపకాని కొచ్చారు.

"ఎర్రోడా—రమ్ము-అదేలే షాంపేను?"

శ్రీనివాసులికి భయం, సంతోషం వేశాయి. ఇంతలకటి ఆమె సీసా, రెండు గాజుగ్లాసులు తీసుకువచ్చి స్టూలుమీద పెట్టింది. కాంగో అడవుల్లో గంధర్వకన్యలా కనిపించింది. ఆమెవొంగొన్నప్పుడు పమిట జారి వక్షోజాలు పడమటి కొండల్లా ఏపుగా కనిపించాయి. ఆమె సర్దుకొని గదిలోంచి వెళ్ళింది.

"మా అమ్మాయ్. పేరు రాణి. తల్లి లేదు. ఇంకా పెళ్ళి సెయ్యనేదు." గ్లాసులోకి రమ్ము వంపాడు. శ్రీనివాసులు షాంపేన్ వంపాడు అనుకున్నాడు. ఇప్పుడు కూతురుపెళ్ళి గొడవ చెప్పాల్సినంత అవసరం ఏమొచ్చింది ? ముసిలివాడు. 'ముసిలి వాడు' అనుకున్నాడు శ్రీనివాసులు.

నువ్వే కన్నావా ? లేక దొరికిందా ? అని అడగాలనిపించింది. చచ్చిపోయే లోపుగా ఈ పీనుగ ఒక్కమంచి పని చేశాడు అనుకున్నాడు రాణిని చూసిన శ్రీనివాసులు.

"ఈ యిల్లు నీదేనా ?"

"అబ్బే ! అద్దెకొంప. ఈ రొండే గదులు. నలభై అద్దె. మేం యిద్దరవేగా సరిపోతుంది. పట్టించు గిలాసు"

"నువ్వేం చేస్తావ్ ?"

సీసాకేసి చూపించి సీసా పగిలిపోయేలా నవ్వాడు.

శ్రీనివాసులు కొంచెం తాగాడు. గొంతు మండింది. ముసిలివాడు మళ్ళా గ్లాసు నింపాడు. శ్రీనివాసులు ఇక తాగలేకపోయాడు. ఓ క్షణం కడుపులో తిప్పింది. తమాయించుకున్నాడు.

ముసిలివాడు పేలాపన మొదలుపెట్టాడు.

"యమ్‌టివోడు కుష్నుడు. నాప్రాపు అర్జిసీడు ఏసిన సినిమా చూశావ్ ?" అని అడిగాడు. కాసేపు గవర్నమెంటుని తిట్టాడు. హైద్రాబాదు వెళ్ళిపోయి పబ్లికున మందు కొట్టు తెరిచి మజాకా చేస్తానన్నాడు. ఇంకెంతలే అన్నాడు. శ్రీనివాసులు ఏవో చెప్తున్నాడు. అతని మనస్సు మాత్రం పక్క గదిలో ముసిలాడి కూతురు 'రాణి' మీదే వుంది. విచిత్రం ! తొమ్మిదిమంది పిల్లల్ని కన్నా మనస్సులో వేడి తగ్గలేదు. రాణి ఎంత అందంగా వుంది. ఇంత అందమైన దానికి వాడు పెళ్ళి చేసేస్తాట్ట! అందంలేని వాళ్ళకిగాని అందమైన వాళ్ళకెందుకూ పెళ్ళి ? ఎవ్వరూ కోరుకోరన్న దాక వున్నప్పుడే పెళ్ళి. అందాన్ని అనుభవించే హక్కు ఒక్కడికేనా ? అది వెన్నెల్లా అందరూ అనుభవించేలా అందుబాటులో వుండాలి. అప్పుడే అందం విలువ. గొప్పతనమూనూ. తనే దేవుడైతే అందమైన వాళ్ళకి పెళ్ళిళ్ళు లేకుండాచేసి. చకోరాలకి వెన్నెలమల్లే ధారపోసేవాడు.

ఏమైనా ఇంత మంచి అంచాన్ని వదిలి పెట్టకూడదు. చచ్చిపోయేది ఎలాగూ చచ్చిపోతున్నాను. బాధపడేందుకు ఇప్పుడు భార్య లేదు. రేపు తనూ ఉండదు. ఆఖరిక్షణాల్లో ఆనందాన్ని నింపుకోవాలి. అసలు ఇందుకేనేమో దేవుడు తన చావుని వాయిదా వేశాడు. తాగిన శ్రీనివాసులి మనస్సు ఇలా ఆలోచనల మధ్య గంతులు వేస్తోంది.

ముసిలివాడు పేలాపన ఆపేశాడు. నిద్ర వస్తున్నట్టుంది. "నడు. మనిద్దరం ఆగదిలో పడుకుందాం"

క్రింద చాపమీద పక్కపరిచింది రాణి. ఇద్దరూ పడుకున్నారు. రాణి చిన్నగదిలోకి వెళ్ళిపోయింది.

శ్రీనివాసులికి నిద్ర రావడంలేదు.

ఊరంతా చీకటి పొళ్ళువిరిచింది.

నిశ్శబ్దం గుండెమీద చర్చిగంట రెండు నిట్టూర్పుల్ని విడిచింది.

ముసిలివాడు నిద్రలో మునిగిపోయాడు. గుర్రుపెడుతున్నాడు.

చీకట్లో శ్రీనివాసులు పక్కకి తిరిగి ముసిలివాడి ముఖంకేసి చూశాడు. ఇక ఇప్పు డప్పుడే లేవడని నిర్ధారణ చేసుకొన్నాడు. ఏమైనాసరే సాహసం చెయ్యాలి. తర్వాత సంగతి చూసుకోవచ్చు అనుకున్నాడు. మెల్లగా లేచాడు. రాణి గది తలుపు దగ్గరగా చేరవేసి ఉంది. శరీరం వేడెక్కిపోయింది. చెవులోంచి వేడిగాలి వస్తోంది. నెమ్మదిగా నెట్టాడు. లోపలికి ప్రవేశించి తలుపు గడియ పెట్టాడు. మంచంమీద అలికిడయింది. తటాలున వెళ్ళి మంచంమీద కురికి ఆమెకేసి చూశాడు. "అరవకు." చీకట్లో ఆమె కళ్ల మెరుస్తున్నాయి. చేతుల్తో ఆమె చెంపలు రాసింది. శ్రీనివాసులికి స్వర్గం కనిపించింది. మనస్సు కుదుటపడింది ఆమె నోటిమీద అణచిన చెయ్యి తీసివేశాడు. ఎన్నో గంటల పాటు వాళ్ళిద్దరూ సుఖానికి నిర్వచనాలయ్యారు.

ఇన్నేళ్ళ శ్రీనివాసులి జీవితానికి ఆరాత్రి ఆ క్షణాలు పరాకాష్టలా అనిపించాయి.

చావబోయేవాని ముసిలివాడు ఆపడం, ఇంటికి తీసుకువెళ్ళి రమ్ము తాగించడం, సుఖం తన్ను వెదుక్కుంటూ రావడం విచిత్ర మనిపించింది శ్రీనివాసులికి. కాసేపు సీజరులా ఫీలయ్యాడు. ముసిలివాడిమీద జాలేసింది. సహాయం చేసినవాణ్ని, అందునా ముసిలివాణ్ని మోసం చేస్తున్నానే అని.

"ఇంకచాలు. లెగండి" అంది రాణి.

తను లేచాడు. ఆమె శ్రీనివాసులి జేబు తడిమింది.

"ఏం కావాలి ?"

"కొత్త పాసింజరుకుమల్లే అడుగుతావేటి ?" అని అతని జేబులోవున్న చిల్లరంతా చొరవగా తీసుకుంది. "జేవాల్ప సరుకనుకొన్నావేటి ?"

ఒక్కసారి శ్రీనివాసులు విచలితుడయ్యాడు. నిషా దిగిపోయింది. క్షణంలో పరిస్థితి అర్థమయింది. ఎంత మోసం. ముసిలివాడిమీది కోపంతో శ్రీనివాసులి మనస్సు ఉడికిపోయింది. చావబోతే పాపం వెనక్కి పిలిచింది.

విసురుగా తలుపు తెరుచుకుని ముందు గదిలో కొచ్చాడు. ముసిలివాడు చుట్టకాలుస్తూ నవ్వుతూ కనిపించాడు. దాంతోటి శ్రీనివాసులు అగ్గిబరాటా అయిపోయాడు. మీదికి లంఘించి ముసిలివాడి గొంతు పట్టుకున్నాడు ముసిలివాడు నవ్వు మానలేదు. రాణి వచ్చి లైటు వేసింది.

"మోసం చేశావు." క్రౌర్యం నిండిన కళ్ళ నిప్పులు కురుస్తున్నాయి.





"యిదిలి పెట్టోకో ! ఎర్రోడా !" శ్రీనివాసుల్ని విదిలించాడు. "నన్ను. నా పిల్లని పోషించుకోడం మోసమా ? నీకుమళ్ళే కడుపున కన్న పిల్లల్ని పోషించుకోలేక సచ్చిపోయి గతిమాలినోన్నవను."

శ్రీనివాసులికి షాక్ తగిలినట్లయింది.

"బతకాలంటే చాలా వున్నయ్ దార్లు. కన్నపిల్లల్ని పోషించుకోడం చాతకాకపోతే సావమనా సదుంకున్న సినోడా ? అడుక్కు తినేనా బతకాలి. నీ కోసరం కాదు. పిల్లలకోసం. తెలిసిందా ? ఏదో బతుకు బతికి జీయితం గడపాలి. ధయిర్యం వుండాలి. శావ కావాలి. యెల్లెల్లు. నీకేది మంచిదని తోత్తే ఆరకంగా బతుకు. నాకుమల్లే మందు—పిల్ల ఏపారం పెట్టాలనుకుంటే పెట్టుకో. లేకపోతే ఆ గుమాస్తా పనే సూసుకో. యెల్లెల్లు ! ఎర్రోడా ! అంతేగాని సావమోక. మొగోడివి. ఇంవాకను నేసిన గనకార్యానికే మొగోన్ననుకోమాక. నువ్వు సత్తే ఆ పిల్లలేమయి పోతారని ఆలోసించనేదేటి ? యెల్లు !"

ముసిలివాడి ముఖంలో నవ్వు లేదు. చూపుల నైశిత్యం శ్రీనివాసుల్ని వివశుణ్ని చేసింది. అంతే - ఇక మారు మాట్లాడలేదు. రాణికేసి ఒక్కచూపు చూశాడు. వెనక్కి తిరిగి వీధిని పడ్డాడు.

తెల తెల్లావుతోంది. పేరు తెలియని పక్షులు ఆకాశంలో అరుస్తున్నాయి. శ్రీనివాసులి గుండెలో మహారణ్యం తగులబడిపోతోంది.

శ్రీనివాసులు నడుస్తున్నాడు వేగంగా.

దార్లో చంకనిపిల్ల నెత్తుకున్న, వేళాపాళాలేని ఓ ముష్టిది కనిపించి. "బాబూ ! పిల్ల ఆకల్తో మండిపోతోంది. రెండ్రోజులు మట్టి తిండి లేదు. దర్మం సెయ్ బాబూ !" అని అడిగింది.

శ్రీనివాసులు జేబులు తడుముకున్నాడు. ఖాళీ ! ముందుకు నడిచాడు. నడక వేగం మరింత హెచ్చింది.

తను చావబోయి బ్రతికాడు.

తను చావకూడదు. బ్రతకాలి. పిల్లల కోసం—పిల్లలకోసం—శ్రీనివాసులు బ్రతకాలనుకున్నాడు. నిజంగా శ్రీనివాసులు బతకాలనుకున్నాడు. చెంగలావ్రి పేట సందులోంచి ఆత్రంగా ఇంటివేపు పరుగెత్తుకుపోతున్న శ్రీనివాసులు 'పిల్లలు—పిల్లలు' అను గొణుక్కున్నాడు. ఇప్పుడతని కంటిముందు పిల్లలు. మనస్సులో బ్రతుకు మీది ఆశ తప్ప మరేమీ లేవు.

ఉన్నట్టుండి తలమీద వెయ్యి గొడ్డళ్ళతో మోదినట్లయింది.

కంటిముందు చీకటి పేరుకుంది.

వొళ్ళుతూలింది.

ఆలోచనలు ఆగిపోయి మెదడు పని చేయడం మానుకుంది.

సృష్టి స్తంభించి నట్టయింది.

అంతేతెలుసు శ్రీనివాసులికి.

* * *

మర్నాడు దేశంలోని వార్తాపత్రిక లన్నిటిలో పేజీ మూలలో. విశాఖపట్నం సందులమధ్య లారీ ప్రమాదంలో శ్రీనివాసులు అనేవ్యక్తి మరణించాడని ప్రకటించబడింది. ఆనవాలు తెలియని శవాన్ని అతని హెడ్ గుమస్తా గుర్తుపట్టి చెప్పాట్ట.

మనిషి ముఖం చీలిపోయి, కళ్ళూ, ముక్కూ మమేకమై పోయినా, తొమ్మిది మంది పిల్లల పోషణ కోసం, పెళ్ళాంరోగాలి మందుల కోసం వినయ పూర్వకంగా, శ్రద్ధగా, కష్టించిపని చేసిన చేతివేళ్ళు, పొంగిన నరాలు- అతని హెడ్ గుమస్తాకి బాగా గుర్తు.